ముసురు వర్షం.. రోడ్లు ఛిద్రం


వెంకటాద్రి కాలనీలో మట్టి రోడ్డును తలపిస్తూ..


బాచుపల్లి బీఎన్ఆర్ కాలేజ్ నుంచి భౌరంపేటకు వెళ్లే రోడ్డు మార్గం బురదమయంగా

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రధాన రోడ్లను మొదలుకుని గల్లీ రోడ్లపై వరదనీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోడ్లు పూర్తిగా మట్టి రోడ్లను తలపిస్తూ బురదమయంగా మారాయి. దీంతో వాహనాలు రోడ్లలో కూరుకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. వర్షాలు పడ్డ ప్రతిసారి తమకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. తాము గ్రేటర్ పరిధిలో ఉన్నామా.. లేక మారుమూల పల్లెల్లో ఉన్నామా అంటూ మండి పడుతున్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. – కుత్బుల్లాపూర్


వెంకటేశ్వరనగర్‌లో రోడ్డుపై వరదనీరు


గాజులరామారం- రోడామేస్త్రీనగర్ రోడ్డుపై వరద


ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులో నిలిచిన వరదనీరు


సాయిపూజా కాలనీలో..


సుభాష్‌నగర్‌లో రోడ్డుపై ..

క్లుప్తంగా

బాలానగర్ అడిషనల్ డీసీపీగా పి.సత్యనారాయణ

కుత్బుల్లాపూర్: బాలానగర్ అడిషనల్ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్) డీసీపీగా పి.సత్యనారాయణను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల్లో బాధ్యతలు చేపడతారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. బాలానగర్ డీసీపీ పరిధిలో కూకట్‌పల్లి, బాలలానగర్ ఏసీపీలతో పాటు కేపీహెచ్‌బీ, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్లు వస్తాయి. తాజాగా బాధ్యతలు చేపట్టే అదనపు డీసీపీకి ఎటువంటి కీలక బాధ్యతలు అప్పగిస్తారన్నది తెలియాల్సి ఉంది.

మేడ్చల్ డీసీపీగా శబరీష్

జగద్గిరిగుట్ట: మేడ్చల్ డీసీపీగా శబరీష్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న సందిప్ గోనె బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ (క్రైమ్)గా విధులు నిర్వర్తిస్తున్న శబరీష్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీపై వెళ్లిన సందిప్ గోనెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.

నేడు అన్నదానం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిదిలోని అంజయ్యనగర్‌లో ఉన్న కట్టమైసమ్మ ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బోనాల సందర్భంగా భక్తులు సమర్పించిన వడి బియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఇన్‌స్పెక్టర్ జి.ప్రశాంత్‌కు అభినందనలు


ప్రశంస పత్రం అందుకుంటున్న పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్..

కుత్బుల్లాపూర్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రశాంత్‌ను సైబరాబాద్ కమిషనరేట్ ఉన్నత అధికారులు అభినందించారు. పలు కేసుల దర్యాప్తులో తనదైన శైలిలో ముందుకు వెళ్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు ఆయనకు బుధవారం సీపీ ప్రశంస పత్రం అందజేసి అభినందించారు.

వైభవంగా బొడ్రాయి నాభిశిలా వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో బుధవారం బొడ్రాయి నాభిశిలా ప్రథమ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు అమ్మవారికి గణపతి పూజ, అర్చన, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్పొరేటర్ జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు

రాయదుర్గం: స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా టీ వర్క్స్‌తో డస్సాల్ట్ సిస్టమ్స్ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ-వర్క్స్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. టీవర్క్స్ సీఈఓ, తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ మాట్లాడుతూ స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయడానికి డస్సాల్ట్ సిస్టమ్స్‌తో భాగస్వామ్యం చేసుకోవడంతో 3డి ఎక్స్‌పీరియన్స్ వర్క్స్ వంటి సరికొత్త సాంకేతికతలతో కేంద్రాన్ని మరింత సన్నద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కలినరీ రీట్రీట్

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో భారీగా రూఫ్ టాప్‌బార్, రెస్టారెంట్‌ను కలినరీ రీట్రీట్ పేరిట బుధవారం ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ రూపేష్ సాగర్ మాట్లాడుతూ పరిపూర్ణమైన డైనింగ్ డెస్టినేషన్‌ను రూపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఆసియా, పాశ్చాత్య వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

'ఉచితంగా విద్య, వైద్యం'

పంజగుట్ట: తమ పార్టీ అధికారంలోకి రాగానే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ కండువా, కరపత్రాన్ని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, అడ్వైజర్లు చిత్ర, సూర్యప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వాసుదేవరావుతో కలిసి ఆవిష్కరించారు.

ఎస్సై కుటుంబానికి అండగా నిలిచిన సహచర పోలీసులు


ఎస్సై కుటుంబ సభ్యులకు రూ.10లక్షల చెక్కు అందజేస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

దుండిగల్: గుండెపోటుతో మృతి చెందిన పోలీస్ అధికారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు సహచర పోలీసులు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ బి.ప్రభాకర్‌రెడ్డి జూన్ 8వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. 2014 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి ధారూర్, యాలాల్, తాండూరు, కొండగల్, దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేశాడు. కాగా గత నెలలో 2014 బ్యాచ్ ఎస్సైలు రూ.30 లక్షలను వారి కుటుంబ సభ్యులకు అందించగా తాజాగా మేడ్చల్ జోన్ పోలీస్ బృందం రూ.10 లక్షలను జమ చేసింది. సదరు చెక్కును బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఎస్సై కుటుంబ సభ్యులకు అందజేశారు. మేడ్చల్ డీసీపీ సందీప్, దుండిగల్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

అల్వాల బాల్‌రెడ్డికి ఘన నివాళులు


బాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తులు

నిజాంపేట్: సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధుడు, ఆర్య సమాజ్ వాది అల్వాల బాల్‌రెడ్డి 108వ జయంతి వేడుకులను బుధవారం ప్రగతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు వక్తలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిజాం పాలనలో రజకార్ల దురాగతాలను ఎదురించారన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి కుమారుడు వాచస్పతిరెడ్డిని సత్కరించారు. ఫిట్ కుత్బుల్లాపూర్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, ఆకుల సతీశ్, వెలగా శ్రీనివాస్, డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, దాసి నాగరాజు, నరేంద్ర చౌదరి, సుమన్ రావు, శేషారావు, రవి యాదవ్, ఈశ్వర రెడ్డి, కౌశిక్ నాయుడు, పృథ్వీ వర్మ, గోపాలకృష్ణమ రాజు, వినోద్ నాయక్, వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వక ముందే గోడలు బీటలు వారాయి..!


డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గోడలకు ఏర్పడిన పగుళ్లను పరిశీలిస్తున్న మల్లారెడ్డి, బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: గృహ ప్రవేశానికి ముందే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల గోడలు బీటలు వారాయని.. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఆయన బహదూర్‌పల్లిలోని డబుల్‌బెడ్ రూమ్ గృహసముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గోడలు బీటలు వారడంతో పాటు సముదాయంలో పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా మారిందని మండి పడ్డారు. ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. నాయకులు శ్యామ్ రావు, లింగం, శ్రీనివాస్, రాజు, ఆచారి, జాంగిర్, సుధాకర్, శ్రీనివాస యాదవ్, భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకోవడంలో కీలకం..
పురస్కారంతో సత్కారం


సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ఇన్‌స్పెక్టర్ పవన్

జీడిమెట్ల: జీడిమెట్ల ఠాణా ఇన్‌స్పెక్టర్ పవన్ ఉత్తమ ఇన్స్‌పెక్టర్‌గా ప్రశంస పురస్కారం అందుకున్నారు. గడిచిన 6నెలల్లో పీఎస్ పరిధిలో నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన కీలక పాత్ర పోషించారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ ఎం. పవన్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు గుర్తించి ప్రశంస పురస్కారం అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందన్నారు. విధి నిర్వహణలో ప్రోత్సాహాన్ని అందించిన ఉన్నతాధికారులకు.. చేదోడు వాదోడుగా నిలిచిన జీడిమెట్ల సిబ్బందికి రుణపడి ఉంటానన్నారు.

చాకచక్యంగా ముఠాను పట్టుకోవడంలో కీలకపాత్ర..

ఈ ఏడాది ఏప్రిల్ 10న మహారాష్ట్రకు చెందిన ఐదుగురు అంతరాష్ట్ర దొంగలు జీడిమెట్ల పీఎస్ పరిధిలో భారీ దొంగతనం చేసేందుకు వచ్చారు. వారు షాపూర్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. ఈ విషయంపై విశ్వసనీయంగా సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ పవన్ ఉన్నతాధికారులతో చర్చించి వారిని పట్టుకునేందుకు ప్లాన్ సిద్ధ చేశారు. 11వ తేదీ రాత్రి వారు ముందుగానే వేసిన ప్లాన్ ప్రకారం రాత్రి అంతరాష్ట్ర దుండగులు ఉన్న చోటును గుర్తించి చుట్టుముట్టారు. సిబ్బందికి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చాకచక్యంగా ముఠాను పట్టుకున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి

వైద్యారోగ్య అధికారి నిర్మల

కుత్బుల్లాపూర్: ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య అధికారి నిర్మల సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సూరారం యూపీహెచ్‌సీలో జ్వరంతో బాధపడుతున్న వారికి టెస్టులు నిర్వహించారు. సుమారు 25 మందికి పరీక్షలు నిర్వహించి వారికి మందులను పంపిణీ చేశారు. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

నిజాంపేట్: వర్షాకాలం దృష్ట్యా అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో రోడ్లు, డ్రైనేజీ, నాలా పనులను వేగవంతంగా పూర్తి చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పురాతన భవనాలను కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ తీగలను సరిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

మాన్‌సూన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే వివేకానంద్
- ప్రజలకు అందుబాటులో టోల్ ఫ్రీ 040-21111111

కుత్బుల్లాపూర్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన జంట సర్కిళ్ల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో మాన్‌సూన్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో చేరిన వరద నీటిని యుద్ధ ప్రాతిపదికన తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. సిబ్బంది పనితీరును ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో కంట్రోల్ రూమ్‌ను ఉంచామని తెలిపారు. 040-21111111ను ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీ మంగతాయారు, ఈఈలు కృష్ణ చైతన్య, గోవర్ధన్‌గౌడ్, టౌన్ ప్లానింగ్, శానిటరీ, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్, జలమండలి శాఖల అధికారులు ఉన్నారు.


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

మురుగు పారుతున్నా పట్టించుకోరా..?


ప్రగతినగర్ రోడ్డులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బస్తీల్లో రోడ్లపై మురుగు పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సీపీఎం మండల పార్టీ నాయకులు వెంకటరాజ్యం, బాలపీరు అన్నారు. ప్రగతినగర్‌లోని కాకతీయ హిల్స్, శ్రీకృష్ణ గార్డెన్ వద్ద రోడ్లపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీటి వద్ద బుధవారం సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. కార్పొరేషన్ పరిధిలో రూ.150 కోట్ల అభివృద్ధి నిధులు వెచ్చించినా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని విమర్శించారు. పాదచారులు మురుగునీటిలో నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్, మలేరియా బాల్స్‌ను చల్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

వ్యాఖ్యలే ప్రచార అస్త్రాలుగా..

ఆకట్టుకుంటూ.. ఆలోచింపజేస్తున్న నినాదాలు

- వినూత్నంగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్‌గా వాల్‌పెయింటింగ్స్


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: రాష్ట్రవ్యాప్తంగా కరెంట్ పాలిటిక్స్ నడుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నేతలు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆందోళనలు, విలేకరుల సమావేశాలు, రైతులకు మద్దతుగా ధర్నాలు చేపడుతుండగా.. ఆ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు ఒక అడుగు ముందుకేసి జాతీయ రహదారుల వెంట కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ వాల్ పెయింటింగ్‌లు వేయించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

◆ 'మూడు గంటల కాంగ్రెస్ కావాలా..! మూడు పంటల బీఆర్ఎస్ కావాలా..!! ఆలోచించు రైతన్న అంటూ.... ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వినూత్న తరహాలో రైతులను మేల్కొల్పే విధంగా పెయింటింగ్ వేయించడం విశేషం. కటిక చీకట్ల కాంగ్రెస్ కావాలా ..? కరెంటు వెలుగుల బీఆర్ఎస్ కావాలా.. మేలుకో రైతన్న అన్న నినాదం అందరినీ ఆకట్టుకుంటోంది.

◆ ఇలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అమెరికాలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. అదే ప్రచార అస్త్రంగా మలుచుకున్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే పలు ఆందోళనలు చేపట్టింది. రైతుల పక్షాన తాము ఉన్నామంటూ భరోసా కల్పిస్తూ వస్తోంది. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తలోరకంగా ఖండించినప్పటికీ రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ రాజు తనదైన శైలిలో వాల్ పెయింటింగ్ వేస్తూ ముందుకు సాగడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.





కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా గోడలపై వాల్‌పెయింటింగ్స్